క్లుప్తంగా

ఉత్సాహంగా స్వచ్ఛతా హీ సేవ


కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుమలనగర్‌లో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టారు. కాలనీలోని మదర్ థెరిసా ఉద్యానవనంలోని ఆటస్థలం, వాకింగ్ ట్రాక్‌లో ఆకులు, పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. పిల్లలు ఆడుకోడానికి వీలుగా, పెద్దలు నడక సాగించడానికి వీలుగా పార్కును తయారు చేశారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఓదూరు అప్పారావు, అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, శ్రీరాములు, కామరాజు, రవి, మారయ్య, వసంత్‌రెడ్డి, ధర్మరాజు, పారిశుధ్య కార్యదర్శి సంధ్య పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: విజయవాడ నుంచి విశాఖ వైపు వచ్చే రైల్వే లైన్ జగ్గయ్యపాలెం వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని బుధవారం రైల్వే పోలీసులు గుర్తించారు. గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి మరణించాడని దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి తెలిపారు. వయస్సు 30 ఏళ్లు ఉంటుందని, ఎత్తు 5.5 అడుగులు, చామనఛాయ రంగు కలిగి ఉన్నాడని.. బ్రౌన్ కలర్ స్వెటర్, బ్లాక్ కలర్ ఫుల్ హ్యాండ్ టీ షర్టు, బ్లూ కలర్ జీన్ ప్యాంటు, వైట్ కలర్ నిక్కర్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహం ఉన్న ప్రాంతం చుట్టు పక్కల వెతుకగా ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. వివరాలు తెలిసిన వారు జీఆర్‌పీ ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి, నంబర్ 7382058996లో సంప్రదించాలని అన్నారు.

కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక: అనకాపల్లి జిల్లా అంకుపాలెంలో ఈనెల 25 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న 71వ అంతర జిల్లాల మహిళా, పురుషుల కబడ్డీ పోటీల పోస్టర్‌ను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల యువత ఆసక్తి చూపుతున్నారన్నారు. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉరుకూటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రసాదుల శ్రీను, వి.బాబూరావు, ఎం.ఉమాశంకర్‌బాబు, పి.అప్పారావు దాస్, పి.వి.రమణ, పి.సత్యనారాయణ, వి.కృష్ణ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

అగనంపూడి: యువతి అదృశ్యంపై దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. రాసాలమ్మకాలనీకి చెందిన ఎ.రాజేశ్వరి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. రాజేశ్వరి కుమార్తె మరియమ్మ (19) మంగళవారం మూడు గంటలకు వీధిలోని కిరణా దుకాణానికి అని వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి ఇంటికి రాకపోవడంతో వెతకడం ప్రారంభించారు. అయితే ఓ వ్యక్తి బైక్‌పై వెళ్లిందని కాలనీలో నివాసముంటున్న వారు చెప్పడంతో రాజేశ్వరి ఆ వ్యక్తి తల్లికి విషయం తెలియజేసింది. తనకు ఏమీ తెలియదని ఆమె బదులివ్వడంతో బాలిక తల్లి రాజేశ్వరి దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

పొగ బెడుతున్నారు!

పరిశ్రమలు వస్తే మా జీవితాలు బాగుపడతాయని ఆశించాం. చివరికి అవే పరిశ్రమలు మా జీవనానికే ముప్పు తెస్తున్నాయి. పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యంతో ఊపిరి ఆడక ఇళ్లు విడిచిపెట్టే పోయే దుస్థితి తెస్తున్నాయి.
పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం ఒక ఎత్తు అయితే.. వ్యర్థాలను సైతం నిర్లక్ష్యంగా తగుల బెట్టడంతో పొగ కమ్మేస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధులతో సతమతమవుతున్నామని వాపోతున్నారు.




తోకాడలో రసాయన వ్యర్థాలు తగులబెట్టడంతో వెలువడుతున్న పొగ

- నిర్లక్ష్యంగా వ్యర్థాలకు నిప్పు
- కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి
- వ్యాధుల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతాలైన ఆటోనగర్, , భెల్, డెయిరీ పరిసరాలతో పాటు ఎక్కడ చూసినా కాలుష్యం కమ్మేస్తోంది. ఫలితంగా పారిశ్రామిక ప్రాంతాలను ఆనుకొని ఉన్న పలు గ్రామాల ప్రజలు సతమత మవుతన్నారు. పరిశ్రమల నుంచి విడుదలవుతున్న ప్రమాదకరమైన పొగ (కార్బన్ మోనాక్సైడ్)తో పాటు పరిశ్రమల వ్యర్థాలను తగులబెట్టడంతో వాటి నుంచి భారీగా విడుదలవుతున్న పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గాలిలో తేలియాడినట్టు కనబడిన పొగ బరువుతో తిరిగి భూమిపైకి చేరుతోంది. ఈ పొగను పీల్చి ప్రజలు శ్వాశకోశ వ్యాధులతో పాటు అనేక రోగాల బారిన పడుతున్నారు. ఆటోనగర్‌లో డంపింగ్ యార్డులో పలు రకాల వ్యర్థాలను ఎప్పటి కప్పుడు తగులబెడుతున్నారు. వాటి నుంచి విడుదలైన పొగ వల్ల డంపింగ్ యార్డును ఆనుకొని ఉన్న ప్రాంతవాసులు పలు వ్యాధులకు గురవుతున్నారు. అక్కిరెడ్డిపాలెం గ్రామం కాలుష్యమయమైంది.ఇప్పటికే నీరు, గాలి, నేల విషతుల్యమయ్యాయి. వీటితో పాటు ఆ మార్గాల్లో నిత్యం రాకపోకలు సాగిస్తున్న వారు సైతం ఇబ్బంది పడుతున్నారు.


ఆటోనగర్ వైపు భెల్ గోడపక్కన చెత్త తగులబెట్టడంతో..


ఆటోనగర్‌లో డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ

వ్యాధులతో సతమతం

పలు ప్రాంతాల వాసులు ఇప్పటికే ఫ్లోరోసిస్ బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో వైపు చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించకుండా కుప్పలుగా పోసి నిప్పు పెడుతున్నారు. ఆటోనగర్‌లో కూడా ఇదే పరిస్థితి. కనీసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉందా లేదా అన్న అనుమానం కలుగుతోంది.

పొగ మధ్య బతుకుతున్నాం

ఆటోనగర్‌తో పాటు స్థానిక పరిశ్రమలు బహిరంగంగా పొగ వదిలేస్తున్నాయి. పొమ్మన లేక పొగ పెడుతున్నారు. వాహనచోదకులతో పాటు స్థానికులు కూడా అవస్థలు పడుతున్నారు. శ్వాశకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు ఈ సమస్యపై స్పందించాలి.

– వసంత్ కుమార్, గాజువాక

రోగాల బారిన పడుతున్నాం

అక్కిరెడ్డిపాలెంలో నివాసం ఉంటున్నాం. నిత్యం నల్లని దుమ్ము ఇంటిని కమ్మేస్తుంది. ఇల్లు ఊడ్చినప్పుడు నల్లని బూడిద వస్తుంది. ఇంట్లోనే ఇలా చేరుతుంటే ప్రజలు పీల్చుతున్నట్లే కదా. చిన్నపిల్లలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి కాలుష్యాన్ని అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలి.

– భాస్కరరావు, అక్కిరెడ్డిపాలెం

తిప్పల దేవన్‌రెడ్డికి ఘన సన్మానం


దేవన్‌రెడ్డిని సత్కరిస్తున్న 65వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన తిప్పల దేవన్‌రెడ్డిని ఆ పార్టీ 65వ వార్డు నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి, పూలమాల వేసి సత్కరించారు. కార్యక్రమంలో ధర్మాల శ్రీను, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, మంగునాయుడు, జుత్తు లక్ష్మి, కోలంటి దేవి తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై ఉక్కుపాదం

156 చదరపు గజాల ప్రభుత్వ భూమి స్వాధీనం


సర్వే నెంబర్ 43/1లో అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: భూ ఆక్రమణపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. తహసీల్దార్ పి.అమల ఆదేశాలతో ప్రభుత్వ భూమిలో నిర్మించిన షెడ్‌ను తొలగించారు. వివరాలివీ.. మండలంలోని దయాల్‌నగర్ ప్రాంతం వికాస్‌నగర్ జంక్షన్‌కు ఎదురుగా బీసీ రోడ్డుకు ఆనుకొని సర్వే నెంబర్ 43/1లో ప్రభుత్వ స్థలం ఉంది. ఆ స్థలం పక్కనే ఉన్న జిరాయితీ స్థలాన్ని ఓ వ్యక్తి కొనుగోలు చేశాడు. ఇదే అదునుగా భావించి అతని స్థలానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలం 156 చదరపు గజాలు ఆక్రమించేశాడు. అక్కడితో ఆగకుండా పెద్ద ఎత్తున నిర్మాణం చేపట్టాడు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న మండల రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించారు. సర్వే చేసి అందులో ప్రభుత్వ భూమి ఉండడంతో ఆక్రమణనును బుధవారం తొలగించారు. అక్కడ ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ అమల తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అక్కిరెడ్డిపాలెంలో కమ్యూనిటీ హాల్‌ను ప్రాంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శిలాఫలకాలను ఆవిష్కరించారు. అక్కిరెడ్డిపాలెంలో రూ.69 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించిన మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాలును బుధవారం వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూషతో కలిసి ప్రారంభించారు. అనంతరం అక్కిరెడ్డిపాలెంలో నిర్మించ తలపెట్టిన రోడ్డు పనులపై పలు సూచనలు చేశారు. అనంతరం మింది, రాంనగర్, రాజీవ్‌నగర్, గిరిప్రసాద్‌కాలనీ, గుడివాడఅప్పన్నకాలనీలలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్, నాయకులు సంద్రాన నూకరాజు, వరదాడ వెంకటరమణ, శీరం రాజేష్, గంటూరు మూర్తి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

65వ వార్డులో..

పెదగంట్యాడ: నియోజకవర్గం పరిధిలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రోడ్డు మరమ్మతు పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. అలాగే 75వ వార్డు పరిధిలోని నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ పక్కనున్న పార్కును అభివృద్ధి చేసేందుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, పులి లక్ష్మీబాయి, నాయకులు రట్టి వాసు, బైపిల్లి గాంధీ, పులి వెంకటరమణారెడ్డి, శ్రీనివాసరావు, సోమునాయుడు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్యంతో ఆటలు తగవు


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పైడిరాజు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్యంతో యాజమాన్యం ఆటలు ఆడుకోవడం తగదని ఉక్కు శ్రామిక సంఘం ప్రధానకార్యదర్శి బొడ్డు పైడిరాజు అన్నారు. బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం సర్వీసులో ఉండగా తమ ఆరోగ్యాన్ని త్యాగం చేశారన్నారు. అందులో భాగంగా అనేక రోగాలు తెచ్చుకోవాల్సి వచ్చిందన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం కోసం నాటి యాజమాన్యాలు పోస్టు రిటైర్‌మెంట్ మెడికల్ స్కీమ్ ప్రవేశపెట్టాయన్నారు.

రూ.1300 చొప్పున భార్యభర్తలకు ప్రీమియం ఏర్పాటు చేసి ఏడాదికి రూ. 3 లక్షలు వైద్య పొందే సదుపాయం ఉండేదన్నారు. అదే విధంగా అవుట్ పేషంట్‌గా రూ. 8 వేలు బిల్లు పొందే అవకాశం కలిపించారన్నారు. అయితే యాజమాన్యం ఆ ప్రీమియంను 8 రెట్లు పెంచేసి ఏకంగా రూ. 10 వేలు చొప్పున కట్టాలని కొత్త స్కీం తేవడం దుర్మార్గమన్నారు. ఏడాదికి భార్యాభర్తలు రూ. 20 వేలు చెల్లించాలంటే ఆ ఉద్యోగికి వచ్చే పెన్షన్ మెడికల్ ప్రీమియంకే సరిపోతుందన్నారు. వెంటనే యాజమాన్యం కొత్త స్కీమ్‌ను ఉపసంహరించి పాత మెడికల్ స్కీమ్ కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరెడ్డి, కరణం సత్యారావు, బొడ్డు రమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, రగ్గుల వితరణ


పేదలకు రగ్గులు అందజేస్తున్న ప్రసన్న కుమార్

గాజువాక: సినీ నటుడు ఐనవోలు ప్రసన్న కుమార్ గాజువాకలోని వివిధ ప్రాంతాల్లో పేదలకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. తన తల్లి వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన రోడ్డు పక్కన గడుపుతున్న వృద్ధులు, పేదలకు దుప్పట్లతోపాటు భోజన ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో జన చైతన్య శ్రీనివాస్, టి.కుమార్, పినిశెట్టి రమేష్, పి.సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ బీహెచ్‌పీవీ – షీలానగర్, 11 కేవీ బీహెచ్‌పీవీ – ఇండస్ట్రియల్ విద్యుత్ సబ్ స్టేషన్లలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ – 2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కిరెడ్డిపాలెం, వివేకానందకాలనీ, విశాఖ డెయిరీ క్వార్టర్స్, షీలానగర్ పెట్రోల్ బంక్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఆదాయార్జనలో స్టీల్‌సిటీ డిపో టాప్


డిపోలో సిబ్బందితో మాట్లాడుతున్న డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్

ఉక్కునగరం: కూర్మన్నపాలెంలోని స్టీల్ సిటీ డిపో ఈనెల 20న రాష్ట్రం మొత్తంలో అత్యధిక ఆదాయం సాధించింది. ఆ రోజు డిపోకు చెందిన బస్సులు 24,624 కిలో మీటర్లు తిరిగాయి. తద్వారా రూ. 17,98,000 ఆదాయం సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే కిలోమీటర్ ఆదాయం రాష్ట్రంలోనే అత్యధికంగా రూ. 73.04 సంపాదించారు. అదే విధంగా ఆక్యుపేషన్ రేషన్ (ఓఆర్)లో రాష్ట్రంలో రెండో స్థానం సాధించారు. బుధవారం డిపోలో జరిగిన కార్యక్రమంలో డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, అసిస్టెంట్ డిపో మేనేజర్ పి. శ్రీనివాసరావు సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సిబ్బంది, కండక్టర్లు, డ్రైవర్లు రాత్రి పగలు కష్టపడి కృషి చేయడం వల్లే ఈ విజయం సాధించామన్నారు. అనంతరం సిబ్బందికి బహుమతులు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో డిపోకు చెందిన కార్మిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులకు మెడికల్ ప్రీమియం పెంపు ఉపసంహరణ, ఉద్యోగులకు జీతాలు వెంటనే చెల్లించాలన్న డిమాండ్లపై గురువారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేయనున్నట్టు స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి తెలిపారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఈ ధర్నాలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

పోర్టు చైర్మన్ దృష్టికి కాలుష్య సమస్య


పోర్టు చైర్మన్ అంగముత్తుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ అనూష, లతీష్

అక్కిరెడ్డిపాలెం: పోర్టు గొడౌన్ నుంచి వెలువడే కాలుష్య సమస్యను నివారించాలని జీవీఎంసీ 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ కోరారు. ఈ మేరకు వారు బుధవారం విశాఖ పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తును కలిసి వినతిపత్రం అందజేశారు. కాలుష్యం వల్ల మింది గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. దీనికి పోర్టు చైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ కాలుష్య నివారణకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని కార్పొరేటర్ అనూష తెలిపారు.

ప్రధాని ప్రకటించే వరకూ పోరాటం ఆగదు

ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు



శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తామని, ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని, అప్పటి వరకు ఉద్యమాలు, ఆందోళనలు ఆగవని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు వి.శ్రీనివాసరావు, బీఎస్‌రాజు, రమణమూర్తి, డి.వి.రమణారెడ్డి, కారు రమణ అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో మంగళవారం చేపట్టిన 1441వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. 2021 జనవరి నాటికి రూ.28వేల కోట్ల టర్నోవర్, రూ.940 కోట్ల నికర లాభంతో నడుస్తున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వ విధ్వంసకరమైన కుట్రలు, కుతంత్రాలతో 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నడిచే శక్తి ఉన్న విశాఖ ఉక్కును 1.5 మిలియన్ టన్నుల ఉత్పత్తికి దిగజార్చిందని ఆరోపించారు. ప్రభుత్వాల తీరు కత్తితో పొడిచి ఆయింట్‌మెంట్ పూసినట్టు ఉందని, ఈ ప్యాకేజీ కూడా ఇదే కోవకు చెందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకొనేలా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఒప్పించాలని, ఆ బాధ్యత తీసుకుంటామని, ఎన్నికల ముందు వాగ్దానాలు చేశారని, విస్మరిస్తే ప్రజలు క్షమించబోరన్నారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాసరావు, రాపాటి కోటేశ్వరరావు, సీహెచ్.సన్యాసిరావు, పోతయ్యరెడ్డి, నగేష్, సత్యారావు, అప్పలరెడ్డి, జగదీష్‌కుమార్, పోలీసనాయుడు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాల్సిందే..

అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ ఉష


అగనంపూడి కూడలిలోని ఆటోస్టాండ్ వద్ద మాట్లాడుతున్న ఆర్ఎంవో డాక్టర్ ఉష

అగనంపూడి: రహదారి భద్రత నియమాలు పాటించకుండా, అజాగ్రత్త, అదుపు తప్పిన వేగంతో ప్రయాణం చేస్తూ నిత్యం రోడ్డు ప్రమాదాల ప్రాంతంగా పారిశ్రామిక ప్రాంతం మారిపోతుందని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ ఉష అన్నారు. జాతీయ రహదారి భద్రతా పక్షోత్సవాల సందర్భంగా అగనంపూడి కూడలిలోని శ్రమశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో చుట్టూ ఖార్ఖానాలు, కర్మాగాలు, చిన్న చిన్న పరిశ్రమలు ఉండడంతో ఎక్కువ మంది ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఆలస్యం అయిందనో, వేగంగా వెళ్లిపోవాలనో వేగంగా వెళ్తుండడం, భారీ వాహనచోదకులు సైతం సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి అదుపు తప్పిన వేగంతో ప్రయాణం సాగిస్తుండడంతో ఈ ప్రాంతంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. దీంతో క్షతగాత్రులుగా మారిపోతున్నారని, దీని వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వాహనచోదకులు గుర్తుంచుకొని వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు.

కార్యక్రమంలో డాక్టర్ రాజీవ్ సుస్తానా, ఐసీటీసీ కోఆర్డినేటర్ ఎం.వి.రవికుమార్, అగనంపూడి లయన్స్‌క్లబ్ కార్యదర్శి ఎం.జగదీష్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, తలారి వెంకటరమణ, కరణం సన్యాసిరావు, ఆటో యూనియన్ నాయకులు నక్కా గోవింద్, చిన్నబాబు, దేముడు, రమణ, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.